# లాలన పాలన

## దీర్ఘాసి విజయభాస్కర్



పె

ళ్ళికాకముందే పెళ్ళాం మీద కోరిక కలిగినట్టు. వంట కాక ముందే భోజనం మీద ఇష్ట పడినట్టు నామినేషన్ వెయ్యకముందే శారద పదవి మీద ఆశలు పెట్టుకున్నాడు సుబ్రహ్మణ్యం.

శారద, సుబ్రహ్మణ్యం భార్యాభర్తలు. శారద మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తుంటే ఏవేవో ఊహాలోకాల్లో తేలిపోయాడు సుబ్రహ్మణ్యం. రేపటి నుండి పేరు ఆమెది. పదవి తనది, తెల్లవారే సరికి మున్సిపాలిటీ వాళ్ళు ఇంటికి వస్తారు. విషయా తే వైనా ముందు తనతో చెప్పాక తను ఓ.కె. గో అహెడ్ అని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాకనేమేడమ్ దగ్గరకి ఫైల్స్ పోతాయి. ఆఫీసర్లు, కాంట్రాక్టర్లు వచ్చే పోయే వాళ్ళతో రేపటి నుండి బిజీ, బిజీ, బిజీ, ఒక్కసారి చప్పట్లు మారుమ్రోగితే ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు.

చాలామంది శారదను. అభినందిస్తూ పూలదండలతో ముంచెత్తారు.

"ఇక ఇంటికి పోదామా అలసిపోయినట్లు న్నావు"

"మీరు వెళ్ళండి"

"నువ్వూ"

"నేను తర్వాత వస్తాను" కమిషనర్ వైపు తిరగి "వెళ్దామా" అంది శారద.

"పదండి"

ముందు కమిషనర్, ఆ వెనుక చైర్‌పర్సన్ ఆమెను అనుకరిస్తూ ఇంజనీరు, శానిటరీఇన్ స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ స్టాఫ్ అంతా వారి వారి వాహనాల్లో బయల్దేరారు.

సుబ్రహ్మణ్యం ఒక్కడే ఇంటిముఖం పట్టాడు.

పట్టణమంతా సుడిగాలి పర్యటన చేసింది శారద. లెట్రిన్స్ లోనికి వెళ్ళి తనిఖీ చేసింది. చాలా అపరిశుభ్రంగా ఉన్నాయి. స్కావింజర్స్‌ని పిలిచి ఎలా క్లీన్ చెయ్యాలో చెప్పింది. క్లీన్‌చేసి చూపించింది.

ఆమె చీపురు పట్టి క్లీన్ చేస్తుంటే అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.

"మన ఆలోచనా విధానం మారాలి. ఆడది దేశానికి ప్రధానమంత్రి అయినా ఒక బిడ్డకు తల్లే. బిడ్డకు అన్నీ చేయట్లేదా? పాయఖానాల్ని చూసి ముక్కులు మూసేసుకుంటున్నాం. ముక్కమూసుకుంటే కంపు పోదు కడిగితే పోతుంది... పబ్లిక్ లెట్రిన్‌లన్నీ శుభ్రంగా ఉంచాలి." అని వర్కర్లకి చెప్పి ముందుకు కదిలింది.

ఒకచోట సిమెంట్ రోడ్డు వేస్తున్నారు. సిమెంట్, కంకర, ఇసుక వేసిన మిక్సర్ గిర్రున తిరుగుతోంది. మాల్ ఎత్తిన గంపలు చకచక నడుస్తున్నాయి. చైర్‌పర్సన్‌ను చూసి మరింత ఉషారుగా చేస్తున్నారు.

"ఇంజనీరుగారు! ఏదెంత వెయ్యాలో అంత వేస్తున్నారా?"

"వేస్తున్నాం మేడమ్! కావాలంటే చూస్కోండి. వన్ ఈస్ట్ టూ ఈస్ట్ ఫోర్"

"ఈ ఈస్ట్‌ల సంగతి నాకు తెలీదు. ఎందుకంటే నేను పెద్దగా చదువుకోలేదు. కానీ రోస్ట్‌లు చేసిన చెయ్యినాది. పైకి, రోష్టుకి, కుర్మాకి, సాంబారుకి, రసానికి పోపులుపెట్టినదాన్ని, వంటల అనుభవంతో చూస్తే ఇక్కడ ఏదో తేడా కనపడుతుంది. అదేంటో మీరు చెబుతారా! నన్నే చెప్పమంటారా?" అంది శారద. 'ఏం కాదు మేడమ్, అంతా కరెక్టుగా ఉంది' కాస్త దబాయించినట్టు అన్నాడు ఇంజనీరు.

"అట్లానా! అయితే శాండ్ కుషన్ ఎంత వెయ్యాలి ఇంజనీరుగారు"

> **ఆడది దేశానికి ప్రధాన మంత్రి అయినా ఒక బిడ్డకు తల్లే. బిడ్డకు అన్నీ చేయట్లేదా? పాయఖానాల్ని చూసి ముక్కులు మూసేసుకుంటున్నాం. ముక్కమూసుకుంటే కంపుపోదు కడిగితే పోతుంది...**

"నాలుగించులు"

"మీరెంత వేస్తున్నారు?"

ఇంజనీరేమి మాట్లాడలేదు

"ఒక సిమెంట్ గంపకి నాలుగు గంపల కంకర, ఆరు గంపల ఇసుక అన్నావు కదా! సిమెంటు గంప, ఇసుక, కంకర గంపలు ఒకే సైజులో ఉన్నాయా! ఏం మాట్లాడవు, పైగా సరిగ్గా మిక్స్ కాకుండానే గంపల కెత్తేస్తున్నారు. పైన దట్టంగా సిమ్మెంటు కనబడుతూనే ఉంటుంది. లోన పట్టి ఇసుకే. మొత్తం రోడ్డు తీసివేసి మళ్లీ వెయ్యండి. మళ్ళీ వేస్తేగాని తప్ప బిల్లు ఇవ్వకండి కమిషనర్‌గారు"



అంటూ అక్కడి నుండి మున్సిపాలిటీలోని ఒక వీధిలోకి వెళ్ళింది. ఆ వీధిలో ఇళ్ళన్నీ ముందుకు ఆక్రమించుకుని ఉన్నాయి. చైర్‌పర్సన్ వచ్చిందనగానే ప్రజలంతా గుమిగూడారు.

"ప్రజలకు నమస్కారం? మనం ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత గాలీ, వెలుతురు అవసరం. బిగుతుగా ఉన్నబట్టలు ఎంత అసౌకర్యమో, ఇరుకుగా ఉండే వీధులూ అంతే అసౌకర్యంగా ఉంటాయి. అందుకే ఇంటి వెనుకముందు ఐదడుగుల ఖాళీస్థలం వదిలిపెట్టాలనే నిబంధన విధించారు. ఏరూలైనా మన సౌకర్యం కోసమే. మీరు ఐదడుగులు వదల్లేదుకదా మున్సిపాలిటీ స్థలాన్ని రెండేసి అడుగులు ఆక్రమించుకొని ముందుకు కట్టేసారు. దానివల్ల రోడ్డు ఇరుకైపోయింది. ఏ అగ్నిప్రమాదమో జరిగితే ఫైర్ ఇంజన్ రాలేదు. ఎవరికో ఏ పురిటినొప్పులో వస్తే ఆటోరిక్షాకూడా లోనికి రాలేదు. ఆలోచించండి.

విశాలమైన రోడ్లు మనకెంతో అవసరం. ఆపద, అవసరాల్లో మనల్ని చాలా ఆదుకుంటాయి. నామాటలు నిజమో అబద్ధమో మీరే ఆలోచించండి."

దేవుని ఆశీస్సులు కోరుకుంటాం, అంతే కదా! అలాగే నేను మీ దీవెనలు మాత్రమే కోరుకుంటున్నాను. ఎవరైనా అడుగడుగునా జోక్యం చేసుకుంటే భరించలేం. మీరు అర్థం చేసుకోండి. నేను స్త్రీని. మీ పురుషులకంటే రెండింతలు ధైర్యం. నాలుగింతల సమయస్ఫూర్తి, ఆరింతలు చతురత, ఎనిమిదింతలు సామర్థ్యం ఉన్నదాన్ని.



"నిజమే" అన్నారు ముక్తకంఠంతో

"ఇంకేమి, మీరు ఆక్రమించుకున్న స్థలాన్ని ఖాళీచేసి రోడ్డు విశాలంగా చేసుకోండి".

అందరూ ఆమెతో ఏకీభవించి ఓనాల్రోజుల్లో రోడ్డు విశాలంగా చేసుకుంటామని మాట ఇచ్చారు.

అక్కడ నుండి తిన్నగా ఆఫీసుకు వచ్చింది.

స్టాఫ్ మీటింగ్ పెట్టింది.

ప్రజలు దేనికీ ఇబ్బంది పడకూడదు పదే, పదే మున్సిపల్ ఆఫీసు చుట్టూ తిరగకూడదు. వాళ్ళ పనులు మనం శ్వాస పీల్చుకున్నంత సహజంగా, సులభంగా జరిగిపోవాలి. అంటూ ఏదేదో చెప్పుకుపోతోంది. ఆడది చైర్‌పర్సన్ అయితే ఆమెకి ఏమీ తెలీదనీ, తమ ఇష్టారాజ్యంగా పరిపాలన వెలగబెట్టొచ్చని కలలుకన్న ఆఫీసర్లకు గొంతులో వెలక్కాయ పడినట్లయింది.

స్టాఫ్ మీటింగ్ పూర్తిచేసుకొని ఇంటికొచ్చింది శారద.

అప్పటికే నిప్పులు కక్కుతున్నాడు సుబ్రహ్మణ్యం.

"నీకేమైనా బుద్ధీ జ్ఞానం ఉన్నాయా? నన్ను వదిలేసి ఆ కమిషనర్‌గాడి వెనక వెళ్ళిపోతావా? అప్పుడే నీకు కొమ్ములొచ్చాయా? నీ సొంత తెలివితేటలు ఉపయోగించొద్దు! ఏ నిర్ణయం తీసుకోవాలన్నా! ఏ ఫైలుమీద సంతకం చెయ్యాలన్నా నన్ను అడగాలి. నా సలహా సంప్రదింపులు అవసరంనీకు. నేను పక్కన లేనని పసిగట్టారనుకో ముంచి పారేస్తారు మున్సిపాల్టీ ఆఫీసర్లు జాగ్రత్త!"

"చూడండీ మీరు నాకు దేవునితో సమానం! దేవుని ఆశీస్సులు కోరుకుంటాం, అంతే కదా! అలాగే నేను మీ దీవెనలు మాత్రమే కోరుకుంటున్నాను. ఎవరైనా అడుగడుగునా జోక్యం చేసుకుంటే భరించలేం. మీరు అర్థం చేసుకోండి. నేను స్త్రీని, మీ పురుషులకంటే రెండింతలు ధైర్యం. నాలుగింతల సమయస్ఫూర్తి, ఆరింతలు చతురత, ఎనిమిదింతలు సామర్థ్యం ఉన్నదాన్ని. ఇంటి వ్యవహారాన్ని తీసుకోండి. ఏ ఇల్లైనా పాడయిపోయిందంటే అది పురుషునికున్న బలహీనత వలనో, అసమర్థతవలనో అవుతుంది తప్ప స్త్రీ అజమాయిషీలో ఉన్న ఏ ఇల్లు ఇంతవరకు పాడయిపోలేదు. పాడయిపోదుకూడా!

"ఇద్దరి బిడ్డల తల్లిని నేను. పిల్లల్ని కడుపులో పెట్టుకొని తొమ్మిది నెలలు ఎలా రక్షించడమో తెల్సిన మాతృమూర్తిని నేను. ఈ పట్టణ ప్రజల్ని మున్సిపాల్టీని ఐదు సంవత్సరాలు నా గుండెల్లో పెట్టుకొని ఎలా రక్షించడమో నాకు తెలీదా! తెల్సు."

"ఆడదానికి తెల్సింది లాలనే కాదు పాలన కూడా! రండి భోంచేద్దురుగానీ" అని వంటింట్లోకి నడిచింది చైర్‌పర్సన్ శారద.

సుబ్రమణ్యం ముఖంలో కత్తివేటుకు రక్తపు చుక్క లేదు!